



'అమ్మా ఇయ్యాల మీటింగుండాదంట. నే పోతుండాను' అంటూ రావమ్మ పరుగు తీయబోయింది.

'ఏడకే. ఆగాగు. మీటింగుంటే నీకేంది' అంటూ కూతుర్ని ఆపేసింది లక్ష్మమ్మ.

'పంతులమ్మ తోడు రమ్మందే. పోవాల' అంటూ వెళ్ళిపోయింది రావమ్మ.

లక్ష్మమ్మ విసుక్కుంది. పంతులమ్మకు పనీ పాటా లేకపోతే తన కూతురికి లేదూ! మీటింగులకు తిరిగితే ఇంట్లో పనులెవడు చేస్తాడు. జుట్టు విదిలించుకుని గట్టిగా ముడివేసుకుని బయలుదేరింది.

దారిలో మరి కొందరు కనిపించారు. అంతా మీటింగుకే వెళ్తున్నారులా వుంది. తెలిసిన వారినడిగింది. 'ఎందమ్మో తిరునాళ కెళ్తున్నట్టుండారు?'

'ఔను లక్ష్మమ్మా. మన ఆడవాళ్ళ కోసమే మీటింగు. మన బాగోగులు చూస్తారు. మన కష్టాలు గట్టెక్కుతాయి. మన హక్కులేమిటో చెబుతారు' అంది ఒకామె.

# మొదటి మెట్టు

## కోమలాదేవి

'అక్కులంటే మాత్రం ఆటిని మనకిత్తా రామ్మా! ఆ మగ మహారాజులు మూడు గీతలు గీసి పారేసినారుగా' అంది లక్ష్మమ్మ జాలిగా.

అవతలి ఆమె విస్తుపోయింది. లక్ష్మమ్మ బాగా అంది—అనుకుంది.

'నువ్వన్నది నిజమే. ఈ సంవత్సరం మన మేలు కోసం అంతా పాటుపడ్తారు. ఆ మూడు గీతల్ని చెరిపేసి మనం స్వేచ్ఛగా తిరగాలి. అందుకే వెళ్తున్నాము' అంది. లక్ష్మమ్మ వారితో వెళ్ళలేదు.

లక్ష్మమ్మ తిన్నగా పంతులమ్మ ఇంటికెళ్ళింది. రావమ్మ ముందు గదిలో చాప మీద కూర్చుంది.

'అమ్మోయ్. టీచరమ్మా. రావమ్మ ఇంట్లో పని చెయ్యకుండా పారిపోయి వచ్చేసింది.' అంటూ ఫిర్యాదు చేసింది లక్ష్మమ్మ.

'ఇవ్వాళ నాకు తోడుగా వస్తుంది. ఎలాగో నువ్వు సర్దుకుపో లక్ష్మమ్మా. మీ సుబ్బిగాడున్నాడుగా. ఇవ్వాళ వాడిని సాయం తీసుకుని వెళ్ళు' అంది టీచరమ్మ.

'వాడామ్మా! వాడెందుకొస్తాడు? పరీచ్చలంట. సదువుకోవాలంటాడు. పేడా – పెంటా పని వాడికేం చేతనైద్ది. చై లేదమ్మా!'

'టీచరమ్మా వినమ్మా. తమ్ముడు చెయ్యకూడదంట. ఆ పనులన్నీ నేనే చెయ్యాలంట. ఎందుకంటే నేను ఆడపిల్లను. వాడేమో మొగోడు.' రావమ్మ ఈసడింపుగా అంది.

టీచరమ్మ నవ్వుతూ ఇవతలికొచ్చింది. అంతా బైటికొచ్చారు. ఆమె వీధి తలుపు తాళం వేసింది.

'రావమ్మను తీసుకెళ్ళొద్దమ్మా. నా మాటిను' ప్రాధేయపడింది లక్ష్మమ్మ.

'త్వరగా వచ్చేస్తాంలే. ఈ మీటింగు మన ఆడవాళ్ళ కోసమే. పెద్దలు మగాళ్ళు కూడా వస్తున్నారు' అంది టీచరమ్మ.

రావమ్మ టీచరు సత్యవతమ్మ. రామిని తోడుగా తన దగ్గర పెట్టుకుంటుంది. సత్యవతమ్మ రెండేళ్ళ పిల్లను ఆడిస్తూ తీరిక సమయాల్లో వారింట్లో సాయం చేస్తుంది రావమ్మ. అక్కడి పని అయిపోయాక ఇంటి పని చెయ్యాలి.

సుబ్బిగాడు సరిగా చదువుకోడు. ఊరి మీద పడి తిరుగుతుంటాడు. ఐనా తల్లికి తండ్రికి వాడి మీద చాలా విశ్వాసం ఉంది. రావమ్మ పుస్తకం తీసుకుని బుడ్డిదీపం దగ్గర కూర్చోగానే తల్లి – సుబ్బిగాడు – తండ్రి అంతా పని గట్టుకుని పనులు చెబుతారు. సుబ్బిగాడిని ఏమీ అనలేక మౌనం దాల్చేది రావమ్మ.

మీటింగ్ ముగిసేసరికి రాత్రి ఎనిమిది గంటలయింది. సత్యవతి యింటి అరుగుమీద కూచున్న వెంకన్న ఆమె తన కూతురితోబాటు రావటం చూచి లేచి నిలబడి చుట్ట ఆర్పేసి చెవి వెనక పెట్టుకున్నాడు.

'ఏం వెంకన్నా, రావమ్మ కోసం వచ్చావా?'

'ఔ తల్లీ. దానికి చదువు మీటింగులు ఏందుకమ్మా?'

'నాకు తోడుగా ఉంటుందని తీసుకెళ్ళాను. నా చేతిలో విద్య ఉంది. రావమ్మకు నేర్పుతున్నాను. మంచి తెలివిగల పిల్ల. ఇంటికెళ్ళగానే ఏం విన్నదో చెప్పించుకో.'

నమస్కారంచేసి తండ్రి వెంట వెళ్తున్న రావమ్మకేసి ప్రేమతో చూచి లోపలి కెళ్ళింది సత్యవతి.

కూతురికి జొన్నరొట్టెలు పెట్టి గోడకానుకుని కూర్చుంది లక్ష్మమ్మ. తనొక సిలవరుగిన్నె ముందుంచుకుంది.

'అయ్యా మీటింగులో ఏం చెప్పింద్రో చెబ్తునా' రొట్టె విరుస్తూ ఆత్రంగా అడిగింది రావమ్మ.

'తెల్సులే. అది సేద్దాం, ఇది సేద్దాం లేకుంటే ఇది సెయ్యండి అది సెయ్యండి. మీరు మంచి గుండాలె. కష్టపడి పం జెయ్యాలె. గవర్మెంటోల్లు అవేవేవో యిత్తారు. దీపాలు పెట్టిత్తాం - బావి తవ్విత్తాం – అంటారు. అయన్నీ వినీ వినీ సెవులు పూడిపోయినై.' నోటి నిండా రొట్టె పెట్టేసుకున్నాడు వెంకన్న.

'అదేం కాదు....' అంటూ చెప్పబోయింది.

'ముందు తిను. అవి కాకపోతే అట్టాంటివే మరికొన్ని ఉత్తమాటలు.' తండ్రి మాటలు విని నోరెత్తలేక నిస్సహాయంగా చూచింది రావమ్మ.

అంతలోకి సుబ్బిగాడు లోపలికొచ్చాడు. వాడి తలంతా చెదరి ఉంది. షర్టు మీద గడ్డి పరకలున్నాయి.

'గడ్డిమోపు అడబడేస్తివి. ఇంటికాడ పెట్టిపోలేదు నువ్వు.' అని కోపంగా అరిచినట్లే అన్నాడు.

'ఆడ అంటే?' అంది రావమ్మ తెలిసి కూడా.

'అదే వామి దగ్గర.'

'ఔనే రామీ ఆ వామి దగ్గర ఒదిలేస్తివి. ఇంత దూరం వీడు తెచ్చిండు' అంది లక్ష్మమ్మ.

'ఏం. వాడు తేలేడూ. చిన్నదేగా మోపు?'

'చిన్నదా? ఎత్తిసూడు ఎంత బరువుండాదో!' అని సుబ్బిగాడు రామిని గద్దించాడు.

'మరి నాకు మాత్రం బరువుగాదూ? రోజూ అంతకన్నా చిన్న మోపు దెస్తే అమ్మ అయ్య వూరుకుంటారూ? రోజూ నేం మొయ్యటంలా?'

'నీకు అలవాటైంది. అది నీ పనయ్యె.'

'అలవాటైందా? నువ్వూ మోస్తే అలవాటౌతుంది. అది నా పనా? ఎట్టా దెల్సురా నీకు?' అంది రావమ్మ రెచ్చిపోతూ.

'అయన్నీ నీ పన్లు' అన్నాడు సుబ్బిగాడు షర్టు విప్పి విదిలిస్తూ.

'పో - బైటికిపోయి విదిలించు. రేపట్నుంచి మోపు కట్టి వస్తాను. నువ్వు ఇంటికి తీసుకురా. నాకు టీచరమ్మగారింట్లో పనుంటుంది. ఆడ నుంచి అటే వెళ్ళిపోతాను.'

'నేనేం తేను పో' అంటూ తన పళ్ళెం ముందు కూర్చుని, ఫిర్యాదు చేస్తున్నట్లు తల్లికేసి చూశాడు సుబ్బిగాడు.

'చిన్న సన్నాసి వాడెట్టా తెత్తాదే రావుడూ?' కూతుర్ని అడిగింది లక్ష్మమ్మ.

'చిన్న!....నాకన్నా రెండేళ్ళు చిన్న. ఐతేయేం – నా కంటే ఏపుగా వున్నాడు. గిద్దెడు పాలు తాగటం లేదూ. పర్లేదు. తెస్తాడులే.'

ఏనాడు పేచీలు పెట్టని రావమ్మ యిలా నిష్కర్షగా చెపుతుంటే వెంకన్నకు ఆశ్చర్యం వేసింది. కూతురి వైపు చూచాడు. బుద్ధిగా కూర్చుని ఎంతో ముచ్చటగా తింటోంది. కొడుక్కేసి చూచాడు. అంతా తన తండ్రి పోలికలే. హడావిడిగా అవురావురుమంటూ తింటున్నాడు. నోటి నిండా రొట్టె పెట్టుకుని తండ్రి కేసి తిరిగి 'అయ్యా దానికి నువ్వు చెప్పు' అన్నాడు.

'రేయ్ – అదీ గిదీ అంటే చెంపలు పగలగొడ్తాను. అక్క అను. నా కంటే చిన్నాడివి. పేరెట్టి పిలిస్తే....'

'ఏం చేత్తావేం?' ఉరిమిచూస్తూ ప్రశ్నించాడు సుబ్బిగాడు.

'ఏం చేస్తానా? నా తమ్ముడికి బుద్ధి జ్ఞానం లేదు – అనుకుని వూరుకుంటాను.' కంచం గ్లాసు తీసుకుని వెళ్ళిపోయింది రావమ్మ.

తల్లి, తండ్రి, సుబ్బి–అవాక్కయి చూస్తూండి పోయారు. ఏమిటీ ధోరణి!

రావమ్మ తల్లీ తండ్రీ తిన్న గిన్నె, కంచెం తీసుకెళ్ళి కడిగి తెచ్చి లోపల పెట్టింది. అరుబయట మంచాలు వాల్చి దుప్పట్లు పరచింది. సుబ్బి తినటం పూర్తయింది. చెయ్యి కంచంలోనే కడుక్కుని లేవబోతున్న తమ్ముడికి 'సుబ్బా కంచం గ్లాసు కడిగి పెట్టేయ్' అని చెప్పి బుడ్డిదీపం ముందు ఈత చాప పరచుకుంది రావమ్మ.

'వాడిని తియ్యమంటుండావే' తల్లి కళ్ళెర్ర జేసింది.

'ఔను. ఆలస్యంగా వచ్చినాడు కదా. నిదానంగా తిన్నాడు. మళ్ళీ నేను చేతులు తడి చేసుకోవటం దేనికమ్మా. బోలెడన్ని లెక్కలు చెయ్యాలి.'

'ఇన్నావా? సదువుకోవాలంట.... లే-లెగు. అడ్ని కడగమంటావటే?' కూతురి రెక్క బుచ్చుకుంది లక్ష్మమ్మ.

తల్లి చెయ్యి విడిపించుకుంటూ రావమ్మ అంది- 'తమ్ముడు మనిషి కాదేటమ్మా? వాడిని మీరట్టా యెనకేసుకు రాబట్టే చదువు లేకండా - కష్టం చెయ్యటం రాకుండా తిరుగుతున్నాడు.'

'నాకు సదువు రాదా?' అంటూ అక్క వీపు మీద గుద్దటానికి వచ్చాడు సుబ్బిగాడు.

చటుక్కున తల్లి చాటు కెళ్ళి 'వస్తే మరి పన్నెండు పదమూడు ఎక్కాలెప్పు. నీ పుస్తకం లోని లెక్కలు చేసి చూపు. తెలుగు చదివి నే చెప్పింది రాయి' అంది రావమ్మ.

అక్క సవాలు చేస్తుంటే వాడికేం చెయ్యాలో పాలుపోలేదు. తలెగరేసి బయటి కెళ్లిపోయాడు.

'చూడయ్యా - ఎంత భయమో. వస్తే కదా రాయటానిక్క' అని పెన్సిల్ అందుకుంది రావమ్మ.

'నువ్వు వాడి పళ్ళెం తియ్యవా?'

'ఇప్పుడు తియ్యను. అడ్ని పాడు చేస్తున్నావే. మొగోడు - వాడికే మే - మారాజు - అంటున్నావు. చదువు మాన్పించి పొలానికైనా పంపు - లేకపోతే చదివించాలంటే బాగా చదువుకునేటట్లు చూడు. అంతే గాని వాడు రౌడీలా తిరుగుతూ ఇంటికొచ్చి పెద్దా చిన్నా లేకుండా అరుస్తుంటే నేనూరుకోను.'

'ఏం జేత్తావేం' తల్లి క్రోధంతో రావమ్మ చెంపకేసి కొట్టింది.

తల్లి అంతగా కొడ్తుందని అనుకోని రావమ్మ బిత్తరపోయింది. శారీరకమైన బాధ కన్నా మానసికావేదన హెచ్చింది. కళ్ళలో నీళ్ళు సుళ్ళు తిరిగి ఆవేదనంతా వేడి కన్నీటి రూపంలో చెక్కిళ్ళ మీదుగా జారినై. ఏదో వెళ్ళగ్రక్కాలని తన బాధనంతా - ఎదురు దిరిగి బయట పెట్టాలని ఆశించింది. కానీ టీచరమ్మ మాటలు చెవుల్లో గింగురుమంటున్నాయి: 'శాంతంతో నెట్టుకు రావాలి. ఎదురు తిరిగితే మన పనులు కావు. ఇంకా కక్ష కడ్తారు, జాగ్రత్త.'

రావమ్మ తల్లి కేసి చూస్తూనే వుంది. వెక్కిళ్ళు పడుతూనే వుంది. 'అయ్యా.... అమ్మ కొట్టింది....ఒక్క పది నిమిషాలు అడుకున్నానా? అన్ని పనులు చేసి మీతో సమానంగా ఇంటి పన్లు జేసినా మీకు నేనంటే కసే. మీకు నా మీద జాలి - ప్రేమ లేవు' అంది.

'మొగోడ్ని అలా సులకన జేత్తే కోపం రాదా? ఆడపిల్లవి నోరు పారేసుకోరాదు.'

'ఆడు నోరు పారేసుకోవచ్చా? వాడికి నాకు ఏంటి భేదం. మేమిద్దరం ఒకటే. వాడికెంతో నాకూ అంతే.' తండ్రికి జవాబు చెప్పింది రావమ్మ.

'నీ కియ్యాల ఏదో మూడింది' అంది లక్ష్మమ్మ.

'ఏదీ మూడలేదు. వాడు మారాజైతే - నేను మారాణిని. చక్కగా పనులు చేసి చక్కగా చదువుకుంటాను. వాడికంటే నేనేం తక్కువ కాదు. మేమిద్దరం సమానమే' అంది వెక్కిళ్ళ మధ్య రావమ్మ.

లక్ష్మమ్మ - వెంకన్నల కర్థమైంది. ఆదేదో మీటింగ్‌కు వెళ్ళింది. పిల్ల పాడైపోయింది. ఇంకేముంది? ఇలా ఎదురు తిరిగితే ఏం చెయ్యాలి? నాల్గు తంతే అదే సర్దుకుంటుంది. సమానం గిమానం అన్నీ మాయమైపోతాయి. కొంతసేపైన తర్వాత ఇద్దరూ రావమ్మకేసి చూచారు. దీక్షగా రాస్తోంది। తండ్రికి జాలేసింది. తల్లి గట్టిగా నిట్టూర్చి కళ్ళు మూసుకుంది.

మరుసటి రోజు రావమ్మ తన పనులన్నీ చకచకా ముగించుకుంది. ఉతికిన పరికిణీకి చిరుగు ఉంటే కుట్టుకుంది. తడికె చాటుకెళ్ళి స్నానం చేసింది. పుస్తకాలు తీసుకుని తల్లి దగ్గర కొచ్చింది.

అప్పటికే సుబ్బిగాడొచ్చి పీట మీద కూర్చుని 'నాకు తొందరగా పెట్టు పరీచ్చరాయాల' అంటూ తొందరచేస్తున్నాడు.

'ఈ రోజు రెండో శనివారం. బడి లేదు కదురా' అంది రావమ్మ.


మామూలుగా వాడు క్రోధంతో అక్కను చూస్తూ అన్నాడు: 'నువ్వు పుస్తకాలు తీస్కుని పోతుండావుగా?'

'టీచరమ్మగారింట్లో పన్జేసి చదువుకుంటాను. నువ్వూ రా. నీకు చెప్తారు. ఆయమ్మ విసుక్కోరు.'

'నువ్వు పో - నేను రాను' చీదరించుకుంటూ అన్నాడు.

'ఎల్లురా. ఇయ్యాల సెలవేగా?' లక్ష్మమ్మ అంది.

'నే పోను.'



పై చిహ్నం అంతర్జాతీయ వనితా వత్సరానికి సంబంధించిన చిహ్నమని అందరికీ తెలిపినదే. ఈ చిత్రాన్ని రూపొందించినవారు వాలెరీ పెటిస్ (దిగువ వున్న ఛాయాచిత్రం) అనే అమెరికన్ వనిత. ఆమె ఈ డిజైన్‌ను చిత్రీకరించి యునైటెడ్ నేషన్స్‌కు ఉచితంగా అందజేశారు. శాంతికి చిహ్నమైన పావురాన్ని. స్త్రీలకు సంబంధించిన శాస్త్రీయ (వృత్తానికి దిగువ క్రాస్) చిహ్నాన్ని. సమానత్వానికి సంబంధించిన గణిత శాస్త్రపు చిహ్నాన్నీ ఆమె ఈ చిత్రంలో ఉపయోగించి. 'డిజైన్' రూపొందించారు.



రావమ్మ మరి మాట్లాడలేదు. పీట వాల్చుకుని కూర్చుని తల్లిని పరీక్షగా చూస్తోంది.

లక్ష్మమ్మ సుబ్బి కంచంలో వేడివేడి అన్నం పెట్టింది. కంది పచ్చడి వేసింది. నేతి పిడతలోంచి నెయ్యి వంచింది. గ్లాసు నిండా మజ్జిగ పెట్టింది.

ఆమె రావమ్మకు కూడా వేడివేడి అన్నం పెట్టింది. పచ్చడి వేసింది. నేతి పిడతలోంచి నెయ్యి పడక ముందే హోటల్‌లో లాగున ఎత్తేసింది. సగం గ్లాసుడు మజ్జిగ పెట్టింది. రోజూ అలాగే తిన్నా ఆ రోజు ఆ భేదాన్ని సహించలేకపోయింది రావమ్మ. 'అమ్మా నెయ్యి' అని నోరు తెరచి అడిగింది.

లక్ష్మమ్మ పిడత వంచింది. కానీ నాల్గు చుక్కలు పడీ పడకముందే ఎత్తేసింది.

అమ్మకు ఎంత భేదం — రావమ్మ చిన్నారి హృదయం తల్లడిల్లిపోయింది. ముందరే తెలుసు తల్లి తనను వేరుగా చూస్తోందని — కాని అప్పుడనుకునేది అంతకుదప్ప తాను ఏమీ ఆశించకూడదని. తిండి దగ్గర — గుడ్డల దగ్గర — సరదాల దగ్గర త్యాగం చేసి తండ్రికి — తమ్ముడికి సరిగా ఉంటే చాలనుకునేది.

గబగబ తిని కంచం తీసి కడిగిపెట్టి 'వెళ్తున్నానమ్మా' అని తమ్ముడి కోసం ఆగకుండానే వెళ్ళిపోయింది.

దారంతా ఒకటే ఆలోచన. తనకు నెయ్యి ఎక్కువగా వేసుకోవాలని ఉండదు. గ్లాసు నిండా మజ్జిగ త్రాగాలనీ లేదు. తమ్ముడు తిన్నంత అన్నమూ తినలేదు. తినాలన్న ఆశకూడా లేదు. తల్లి వడ్డించినా తినలేదు. కానీ వాళ్ళ కెందుకంత పక్షపాతం! తనను తక్కువగా చూడటం దేనికి? అన్ని పనులు తనకు పురమాయిస్తారు. ఎంత చేసినా తృప్తిలేదు. సుబ్బిగాడు ఊరంతా తిరిగి వెధవాటలు ఆడి జల్సాగా తిరిగి బడి కెళ్ళకుండా వచ్చినా ఏమీ అనరు. వాడు మగమహారాజట! మరి తను పేద ఆడదా?

రావమ్మ సత్యవతి ఇంటికెళ్ళి గదులన్నీ వూడ్చింది. గిన్నెలు కడిగాక, వరండాలో చాప వేసుకుని కూర్చుంది.

'ఏం రావమ్మా, అలా ఉన్నావేం?' సత్యవతి అడిగింది.

రావమ్మ ఆమెకు రాత్రి జరిగినదంతా వివరించింది. తల్లి కొట్టినట్లు చెపుతుంటే దుఃఖం ముంచుకొచ్చింది.

సత్యవతి హృదయం జాలితో నిండిపోయింది. దగ్గరకొచ్చి కూర్చుని తలమీద చేయి వేసింది. 'ఊరుకో రావమ్మా. నువ్వు చిన్నపిల్లవి — ఇవన్నీ చిన్న చిన్న బాధలు. అసలు మొట్ట మొదట నీలో మార్పు రావాలి. నేను తమ్ముడి కన్నా తక్కువేం కాదు. తమ్ముడెంతో నేనూ అంతే అన్న భావన నీలో దృఢంగా నాటుకు పోవాలి. చదువుకోవటం వల్ల నీకు పొగ రెక్కిందని — మగపిల్లాడిని పట్టుకుని నానామాటలంటున్నావనుకుంటారే గాని - చదువు వల్ల నీకు అబ్బిన అమూల్యమైన మనోవికాసం వాళ్ళ కర్థం కాదు. అక్క నాకన్నా ఎందులోను తీసిపోదు అన్న జ్ఞానోదయం తమ్ముడికి కలిగించటం నీ విధి. కంచం కడగటం — మోపు తేవటంలో నీ విలువ తగ్గదు. ఆ పన్లు నేనూ చేయవచ్చు అన్న భావన వాడికి కలిగించాలి. ఏడ్చి బాధపడకు. మీ అమ్మ నిన్ను కొట్టకుండా చూచుకో.

'ఓర్పుతో చాకచక్యంతో నీ స్థానం ఏమిటో మీ వాళ్ళకు తెలియజెయ్యాలి. ఊఁ. ..ఇక కళ్ళు తుడుచుకుని రాత్రి చేసిన లెక్కల్ని చూపించు' అంది.

రావమ్మ గబగబా కళ్ళు తుడుచుకొని నోటు పుస్తకం టీచర్‌కు అందించింది.

ఆ సాయంత్రం రావమ్మ హుషారుగా ఇంటి కొచ్చింది. సుబ్బిగాడు గుమ్మంలోనే ఎదురయ్యాడు. మోపు తేవాలేమో — తప్పించుకోవాలని చూశాడు.

'సుబ్బూ, ఇది తిను. టీచరమ్మ ఇచ్చారు. నీ క్కూడా ఇదంటే ఇష్టమని తెచ్చాను.' అంటూ ఆకు పొట్లాన్ని అందించింది.

వాడు ఆత్రంగా అందుకుని తెరచి చూశాడు. రెండు బొబ్బట్లున్నాయి అందులో. ఆ పొట్లం రావమ్మ విప్పినట్లు లేదు.

'నువ్వు తిన్లే?'

'లేదు. ఇక్కడ కూర్చో తిందాం. చిన్న ముక్క అమ్మకిద్దాం' అంటూ మంచం మీద కూర్చుంది రావమ్మ.

'టీచరమ్మ బాగా చేసిందే' అంటూ గబగబా తిన్నాడు సుబ్బిగాడు. చేతులు కడుక్కుని 'రా పోదాం. టీచరమ్మ దగ్గరికి మరి పోనక్కర్లేదు. మోపు తెచ్చుకుందాం. నాతో రా! నువ్వు మొయ్యొద్దులే' అంటూ త్రాళ్ళు తీసుకుంది. సుబ్బు మారు పలక్కుండా అక్క వెంట వెళ్ళాడు. రావమ్మ తమ్ముడికి ఏమేమో కబుర్లు చెపుతోంది. అక్క మీద కసి ఎలా తీర్చుకోవాలా — అని అంత సేపు ఆలోచించిన సుబ్బు అదంతా మర్చిపోయాడు. అక్కలోని మార్పుకు ఆశ్చర్యపోతున్నాడు. అక్కకు తనంటే ఎంత ప్రేమ. టీచరమ్మ ఏది ఇచ్చినా తనకు తెస్తుంది. తను ఒక్కనాడు ఒక్క వేరుసెనగపప్పు గాని — ఒక్క సీమచింతకాయ గాని ఇచ్చి ఎరుగడే!

ఏదో ముచ్చట్లాడుకుంటూ వామిని సమీపించారు.

రావమ్మ ఆ రోజు కావాలనే పెద్ద మోపు కట్టింది.

తల మీద కుదురు సర్దుకుని, 'ఎత్తురా' అంది తమ్ముడితో.

'బరువే. ఇంత పెద్దది కట్టావే?'

'మరి చాలొద్దూ. అమ్మ కోప్పడుతుంది.' తమ్ముడికి జవాబు చెప్పింది రావమ్మ.

సుబ్బు ఆ మోపు కేసిచూస్తూ కొంత సేపు నుంచున్నాడు. 'అప్పా రెండు చెయ్యి. నేనొకటి తెత్తాను' అన్నాడు.

'బ్రోస్. మంచి ఉపాయమే చెప్పావు. నీది చిన్నది కట్టాలే' అంటూ చిన్న మోపు కట్టింది. ఇద్దరు చెరొక మోపు మోసుకొస్తున్నారు. రావమ్మ మనసెంతో తేలికగా ఉంది.

మెల్లిగా అంది. 'రాత్రి నా దగ్గర కూర్చుని చదువుకో సుబ్బూ. ఎక్కడికోపోయి చదువుకొస్తానంటావు. అదంతా ఒట్టిదేనని నాకుతెలుసు. చక్కగా చదువుకుంటే ఎంత బావుంటుంది?'

సుబ్బు మాట్లాడలేదు.

ఇద్దరూ ఇంటి దారి పట్టారు.

'వాడినెత్తిన మోపెట్టావూ-అనుకుండానే...' అంటూ క్రోధంతో ముందుకొస్తున్న తల్లి ఎదురుగా మోపు పడేసి 'పెద్దమోపని సగం నేను తెచ్చాను' అన్నాడు సుబ్బిగాడు. ఏనాడూ చిటికెన వేలయినా కదపని తన కొడుకు నోట ఆ మాట రాగానే అవాక్కయి నుంచుంది లక్ష్మమ్మ.

'ఊఁ....అడబడేయ్' అంటూ లోపలికెళ్ళిపోయింది.

రావమ్మ హాయిగా ఊపిరి పీల్చింది. ఇంట్లోకి మెట్లెక్కుతూ ఇది మొదటి మెట్టు — అనుకుని ఉత్సాహంగా తల్లికి సాయం చెయ్యటానికి వెళ్ళిపోయింది. *